నేటి దినపత్రిక

# సూర్య

## కర్నూలు | నంద్యాల

గురువారం | 29 ఫిబ్రవరి 2024 | పేజీలు 8




క్యూలైన్లో నినాదాలు చేస్తున్న శివ స్వాములు

శ్రీశైలంలో శివస్వాముల

# ఆగ్రహం

- విఐపీల దర్శన సేవలు తగ్గించి సామాన్య భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలని ఆవేదన
- ఈవో డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసిన శివ భక్తులు

**శ్రీశైలం, మేజర్‌న్యూస్ :**

నంద్యాల జిల్లా శ్రీశైల శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి,అమ్మవార్ల దేవస్థానంలో బుధవారం శివ స్వాములు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మరో రెండు రోజులలో శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మొదలు కానున్న నేపథ్యంలో ఆదిలోనే శివ స్వాములకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం వలన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవని భక్తులు అభిప్రాయపడుతున్నారు. స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్నామంటూ,క్యూలైన్ల నిర్వహణ, వసతులు సక్రమంగా మిగతా 2లో

# పాతాళంలోకి గంగ..!

- మల్లన్న సన్నిధిలో జల్లు స్నానాలే
- కృష్ణానదిలో అడుగంటిన నీటి నిల్వలు
- శ్రీశైలం డ్యాంలో నీటి నిల్వ 37 టీఎంసీలు
- త్వరలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం..
- భక్తులకు ఇక్కట్లు తప్పేనా..?

**శ్రీశైలం, మేజర్‌న్యూస్:**

ద్వాదశ జ్యోతిర్లింగం,అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైల మహా క్షేత్రంలో మార్చి 1వ తేదీ నుండి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.భ్రమరాంబ సమేతుడైన మల్లికార్జున స్వామి స్వయంగా వెలసిన శ్రీశైల క్షేత్రం దర్శనంతో జన్మ ధన్యం అవుతుందని భక్తుల నమ్మకం. ఈ క్రమంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను కన్నులారా తిలకించడంతో పాటు పవిత్ర పాతాళగంగలో పుణ్యస్నానాలు చేసి పాపాలు తొలగించుకు నేందుకు భక్తజనులు తపిస్తారు.శివరాత్రి బ్రహ్మోత్సవాల వేళలో ఓం నమఃశివాయ...అంటూ పాతాళ గంగలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు.అయితే ప్రస్తుతం సాక్షాత్తు ఆ పరమశివుడి మిగతా 2లో



లింగాలగట్టు వద్ద లోలెవెల్ హైలెవెల్ పుష్కర్ ఘాట్ల పరిస్థితి



శ్రీశైలం డ్యాం వెనుక భాగాన నీటి నిల్వల దృశ్యం



- రేపో, మాపో ప్రకటించనున్న వైసీపీ అధిష్టానం
- ఇప్పటికే వీఆర్ఎస్ తీసుకున్న ఇంతియాజ్
- తక్షణమే ఆమోదం తెలిపిన రాష్ట్ర డీజీపీ
- మైనార్టీ శాఖ సెర్ప్ సీఈవోగా విధులు నిర్వహిస్తున్న ఇంతియాజ్

# వైసీపీ కర్నూలు బరిలో ఐఏఎస్ ఇంతియాజ్?

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:**

గత కొంతకాలంగా కర్నూలు అసెంబ్లీ స్థానానికి వైసీపీ తరపున అభ్యర్థి ఎవరు అన్న అంశంలో దోబుచూలాడుతున్న పార్టీ అధిష్టానం ఎట్టకేలకు ఐఏఎస్‌ను బరిలో దింపేందుకు నిర్ణయించినట్లు సమాచారం. సీనియర్ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అహమ్మద్ కర్నూలు అసెంబ్లీ బరి నుంచి పోటీలో నిలిపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించినట్లు సమాచారం. 2009 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఎ.ఎం.డి.ఇంతియాజ్‌ను పోటీలో నిలుపనున్నట్లు తెలుస్తోంది. కర్నూలు నగరానికి చెందిన కె.ఎం.హాస్పిటల్ మిగతా 2లో

మాజీ రాజ్యసభ సభ్యుడు

# టీజీవీకి మాతృ వియోగం

- నివాళులర్పించిన ప్రముఖులు
- ముగిసిన అంత్యక్రియలు



గౌరమ్మ పార్థీవ దేహానికి నివాళులు అర్పిస్తున్న టీజీ వెంకటేష్, టీజీ భరత్



గౌరమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీజీ కుటుంబ సభ్యులు



టీ జీ గౌరమ్మ

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి:**

రాజ్యసభ మాజీ సభ్యులు, ప్రముఖ పారిశ్రామికవేత్త టీజీ వెంకటేష్‌కు మాతృవియోగం కలిగింది. టీజీ వెంకటేష్ తల్లి టీజీ గౌరమ్మ(96) బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు గౌరీ గోపాల్ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. అయితే ఆమె కోలుకోలేక మృతిచెందారు. దీంతో టీజీవీ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. టీజీ గౌరమ్మకు ఆరుగురు సంతానం. నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. మూడవ సంతానమైన టీజీ వెంకటేష్ రాజకీయంగా, వ్యాపారాల్లో రాణించారు. ఆమె మనువడు టీజీ భరత్ కర్నూలు టీడీపీ ఇన్‌చార్జిగా, టీజీవీ సంస్థల చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. సాయంత్రం వరకు ఆమె పార్థీవ దేహాన్ని సందర్శన నిమిత్తం ఉంచారు. అనంతరం అశేష జనవాహిని వద్ద పాతనగరంలోని జమ్మిచెట్టు వద్ద ఉన్న సద్గురుదత్త హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కుమారుడు టీజీ వెంకటేష్, టీజీ రాఘవేంద్రయ్య, మనువడు టీజీ భరత్‌లు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

**ప్రముఖుల నివాళి:** టీజీ వెంకటేష్ మాతృమూర్తి మరణ సమాచారం తెలుసుకున్న పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, కోట్ల సుజాతమ్మ, మణిగాంధీ, మదన్‌గోపాల్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, మిగతా 2లో

# పాతాళంలోకి గంగ..!

(మొదటిపేజీ తరువాయి)

పాదాల చెంత ప్రవహిస్తున్న కృష్ణమ్మ నేడు వెలవెలబోతుంది.పవిత్ర పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఈ ఏడాది భక్తులకు ఇక్కట్లు తప్పవని పలువురు పేర్కొంటున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగా దేవస్థానం అధికారులు పాతాళగంగ వద్ద ప్రత్యేక ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు.భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తారు.దీంతో మెట్ల మార్గంలో అవసరమైన విద్యుద్దీ పాలు,బారికేడింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.స్నానఘాట్ల వద్ద దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్ల సదుపాయాలను సిద్ధం చేస్తున్నారు. స్నానఘాట్ల వద్ద నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య సిబ్బందికి విధులు కేటాయించనున్నారు. జిల్లా యంత్రాంగం, దేవస్థానం సిబ్బంది సంయుక్తంగా పారిశుద్ధ్య విధులను పర్యవేక్షించనున్నారు. స్నానఘాట్ల వద్ద గజ ఈతగాళ్లను నియమించనున్నారు.గతంలో కరోనా నేపథ్యంలో పాతాళగంగలో దిగి పుణ్యస్నానాలు ఆచరించకుండా జల్లు స్నానాలను అధికారులు ఏర్పాటు చేశారు.ఆ తర్వాత శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులు కృష్ణానదిలో స్నానాలు ఆచరించేందుకు,మెట్లు దిగలేని వారికి జల్లు స్నానాలను రెండు దేవస్థానం ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుత ఏడాది ఆశించిన మేర వర్షాలు లేకపోవడంతో శ్రీశైల డ్యాం నిండకపోవటంతో నేడు నదిలో నీటి నిల్వలు అడుగంటడంతో పుణ్యస్నానాలు,త్రాగునీటి సమస్యలు తప్ప వేమోనని హిందూ సంఘాల


పాతాళ గంగ


లింగాలగట్టు వద్ద లోలెవెల్ హైలెవెల్ పుష్కర్ ఘాట్ల పరిస్థితి

నాయకులు భావిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అన్ని ముందస్తు ప్రత్యామ్నాయ చర్యలు పాటించాలని వారు కోరుతున్నారు. అలాగే శ్రీశైలం దేవస్థానం పరిధిలో వివిధ వసతి గృహాలతోపాటు ఆయా కులాలకు చెందిన నిత్య అన్నదాన సత్రాలు అధికంగా ఉన్నాయి.వీటన్నిటి దృష్ట్యా బ్రహ్మోత్సవాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతరం నీటి సౌకర్యాల అవసరం ఎంతైనా ఉంది.

**జలాశయంలో నీటి నిల్వ 37 టీఎంసీలు**

శ్రీశైల జలాశయంలో నీటిమట్టం 817.70 అడుగులు,నీటి నిల్వ 37.8085 టీఎంసీలుగా నమోదైంది.నీటిమట్టం తక్కువగా ఉండటంతో శ్రీశైలంలో పాతాళగంగ వద్ద మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. స్నానఘాట్ల వద్ద పటిష్ఠమైన బారికేడింగ్,పర్యవేక్షణ కీలకం కానుంది.

**జల్లు స్నానాలు ఏర్పాటు..**

కృష్ణా నదిలో నీటి నిలువలు తక్కువగా ఉన్నప్పటికీ పవిత్ర పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. దీంతోపాటుగా పాతాళగంగ మెట్లు దిగలేని వారికి క్షేత్ర పరిధిలో జల్లు స్నానాలను ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది తరహాలోనే పాతాళగంగ స్నానఘాట్ల వద్ద, రాజుల సత్రం,ఆర్టీసీ బస్టాండ్ వెనుక భక్తుల సౌకర్యార్థం జల్లు స్నానానికి షవర్లను ఏర్పాటు చేయనున్నారు.కలెక్టర్ ఆదేశాల మేరకు షవర్లను సంఖ్యలో పెంచారు.మరోవైపు పాతాళగంగ వద్ద నీటిమట్టం తగ్గుతుండడంతో బారికేడ్లను ఏర్పాటు చేస్తారు. భక్తులు పుణ్యస్నానాలు సజావుగా జరిగేందుకు పోలీస్,మత్స్యశాఖ సిబ్బంది పర్యవేక్షిస్తారు. అధికారులు నిర్దేశించిన సురక్షిత మైన ప్రదేశాల్లోనే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**లింగాలగట్టులో లెవెల్ హై,లెవెల్ పుష్కర ఘాట్ల వద్ద..**

శ్రీశైలం డ్యాం దిగువన గల లింగాల గట్టు మత్స్యకార గ్రామం వద్ద కృష్ణా నదిలో లో లెవెల్,హై లెవెల్ అనే రెండు పుష్కర ఘాట్లు కలవు.తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చే భక్తులు ఆంధ్ర,తెలంగాణ సరిహద్దు వంతెన దిగువ భాగాన ఉన్న ఈ పుష్కర్ ఘాట్ల వద్దనే నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు.విద్యుద్దీపాలు,బారికేడింగ్, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్ల సదుపాయాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఈ రెండు పుష్కర ఘాట్ల సమీపంలో నీటి నిల్వలు లేవు.ఈ ఏడాది శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయి నిండాకపోవడంతో డ్యాం గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే పరిస్థితి లేకపోవడంతో పుష్కర ఘాట్ల వద్ద నీటి నిల్వలు అడుగంటాయి.

**భక్తులకు ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేస్తాం**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం తరలివచ్చే భక్తులకు పుణ్యస్నానాలు ఆచరించేందుకు,త్రాగునీటి కొరత లేకుండా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు తెలిపారు.కృష్ణానదిలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

## శ్రీశైలంలో శివ స్వాముల ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

లేదంటూ దర్శనార్థమై క్యూలైన్లో వేచి ఉన్న శివ స్వాములు తెలిపారు.శ్రీశైల క్షేత్రానికి వచ్చే విఐపి భక్తుల సేవలను తగ్గించి సాధారణ భక్తులకు దర్శన సమయంలో ఇబ్బందులు కలగకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు.భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్ లో మంచినీటి సౌకర్యం,ఉచిత అన్న ప్రసాదం,ఫలహారాల సౌకర్యం లేకపోవడంతో వృద్ధులు,మణికంఠ స్వాములు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులు శివ స్వాముల అవసరాలను గమనించి ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని కోరారు.అధిక సమయం క్యూలైన్లో వేచి ఉండటంతో సహనం కోల్పోయిన భక్తులు ఒక్కసారిగా ఈవో డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

**కర్నూలు సిటీ, మేజర్‌న్యూస్:** ప్రభుతువ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నగర అధ్యక్షుడు బాబయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ముందు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా డయాగ్నోస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారన్నారు. ప్రజల నుంచి ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి అనుమతులు లేని సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు బీసన్న, చంటి, సురేంద్ర, కాశీం, శేఖర్, వీరయ్య పాల్గొన్నారు.

## రౌడీషీట్ తొలగించాలి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:** నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌పై ఓర్వకల్లు పోలీసుస్టేషన్‌లో ఓపెన్ చేసిన రౌడీ షీట్‌ను వెంటనే తొలగించాలని టీడీపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకల్లు పోలీసుస్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బీసీ నాయకుడిపై పాత కేసులు చూపించి ఆ కేసు అక్రమంగా నమోదు చేశారన్నారు. ఈ ప్రభుత్వం బీసీలను అణచివేసేందుకు చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ కర్నూలు బరిలో ఐఏఎస్ ఇంతియాజ్?

(మొదటిపేజీ తరువాయి)

అధినేత డాక్టర్ ఇస్మాయిల్‌కు స్వయాన అల్లుడు ఇంతియాజ్‌అహమ్మద్. ప్రస్తుతం ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్‌గా, సెర్ప్ సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఉమ్మడి కృష్ణాజిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఇంతియాజ్ అహమ్మద్‌కు కర్నూలు నగరంలోని మైనార్టీ వర్గంలో మంచి పరిచయాలు ఉన్నాయి. కర్నూలు అసెంబ్లీ బరిలో వైసీపీ తరపున ఆశావాహుల పేర్లు ఎన్నో వినిపించినప్పటికీ చివరికి ఐఏఎస్ అధికారి వైపే అధిష్టానం మొగ్గు చూపినట్లు సమాచారం. ప్రస్తుత ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మరోసారి బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపగా ఆయనకు రాజ్యసభకు పంపుతామని ఇచ్చిన హామీతో ఆయన వర్గం కాస్త హడావిడి చేసినా టికెట్ మాత్రం దక్కని పరిస్థితి నెలకొంది. అలాగే మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి సతీమణి ప్రస్తుతం కేడీసీసీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి పేరు సైతం ఆశావాహుల జాబితాలో కనిపించింది. అలాగే ఇంధన శాఖ పీఆర్వో పూలబషీర్, ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ ఇలియాజ్‌బాష పేర్లు కూడా పరిశీలించారు. అయితే చివరకు మైనార్టీ వర్గాల్లో మంచి పేరున్న కెఎం. హాస్పిటల్ అధినేత ఇస్మాయిల్ అల్లుడు ఇంతియాజ్ వైపే పార్టీ మొగ్గుచూపినట్లు సమాచారం. కర్నూలు అసెంబ్లీ స్థానాన్ని మొదటి నుంచి మైనార్టీలకే కేటాయిస్తారని చర్చ జరిగినా నేపథ్యంలో ఐఏఎస్ ఇంతియాజ్‌అహమ్మద్‌ను బరిలో దింపుతున్నట్లు చర్చ సాగుతోంది. ఈ చర్చకు బలాన్ని ఇస్తూ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

**వీఆర్ఎస్ తీసుకున్న ఇంతియాజ్ అహమ్మద్:**

కర్నూలు అసెంబ్లీ స్థానం నుంచి మైనార్టీ కోటాలో సీనియర్ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్‌అహమ్మద్‌ను బరిలో నిలుపుతున్నారన్న ప్రచారం కొనసాగుతుండగానే అందుకు ఊతమిచ్చేలా ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అహమ్మద్ బుధవారం వాలంటరీ రిటైర్డ్‌మెంట్‌కు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న 24గంటల్లోపే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్‌అహమ్మద్ దరఖాస్తును పరిశీలించి వీఆర్ఎస్‌కు అనుమతి ఇస్తూ జీవో నెం 477 విడుదల చేశారు. దీంతో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థిగా ఇంతియాజ్‌ను వైసీపీ నాయకత్వం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీవీకి మాతృవియోగం


నివాళులు అర్పిస్తున్న సోమిశెట్టి వేంకటేశ్వర్లు

(మొదటిపేజీ తరువాయి)

అవుకు జడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి, కోడుమూరు వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోలంకి రామస్వామి, నగరూరు రాఘవేంద్ర, మైనార్టీ నాయకులు హవిలాన్‌బాబు, ఆర్యవైశ్య మహా సభ నాయకులు ఇల్లూరు లక్ష్మయ్య, రాజకీయ పార్టీల నాయకులు, టీజీవీ సంస్థల ఉద్యోగులు, అభిమానులు, కార్యకర్తలు నివాళులర్పించారు.


నివాళులు అర్పిస్తున్న తెదేపా నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి


నివాళులు అర్పిస్తున్న మాంటెసోరీ పాఠశా లాల అధినేత రాజశేఖర్


నివాళులు అర్పిస్తున్న ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు


నివాళులు అర్పిస్తున్న ఎస్ వీ మోహనరెడ్డి, ఎస్ వీ విజయ మనోహరి


నివాళులు అర్పిస్తున్న భాజపా నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, నీలకంఠ

# భూమా అఖిలప్రియ సమక్షంలో టిడిపిలో భారీ చేరికలు



పార్టీలో చేరిన నాయకులతో మాజీమంత్రి

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండలంలోని పెద్దవంగలి గ్రామంలో ఉపసర్పంచ్ బాల నరసింహుడు వార్డు మెంబరు హుసేన్‌బీ, నాగరాజు, వెంకటసుబ్బయ్య,వెంకటేష్, దస్తగిరి,పాపయ్య, పవన్, అబ్దుల్‌తో పాటు 50 కుటుంబాలు మాజీమంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో టిడిపిలో చేరారు. గ్రామానికి చేరుకున్న భూమా అఖిలప్రియ, భార్గవరాములను టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున గజమాలతో స్వాగతంపలికారు. అనంతరం గ్రామంలో ప్రముఖ దస్తగిరి స్వామి దర్గాలో ప్రత్యేక ఫాతేహాఃలు సమర్పించారు అనంతరం టిడిపిలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమను తమ నాయకత్వాన్ని నమ్మి పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని తెలియజేశారు జగన్మోహన్ రెడ్డిని నమ్మి రాష్ట్ర ప్రజలు ఓటేసినందుకు గత ఐదేళ్లుగా అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆమె విమర్శించారు.

**టిడిపి నాయకుడికి పరామర్శ :** మండలంలోని చిన్న వంగలి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బాపతి రాజశేఖర్ రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై కోల్పున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి భూమాఅఖిలప్రియ గ్రామానికి చేరుకొని పరామర్శించింది. కార్యకర్తలకు తమ కుటుంబం అన్ని విధాల అండగా ఉంటుందని తెలియజేశారు కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసిం హారెడ్డి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్ భాష,టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శిగుత్తినర్సింహులు,టిడిపినాయకులు పాల షరీఫ్,నర్సయ్య, నరసింహులు, నాగేంద్ర, మహబూబ్‌పీరా, సుబ్రమణ్యం,నర్సిరెడ్డి, సంజీవరెడ్డి,గురుశేఖర్,రాజు,కొలిమి హుసేన్‌వలి,షరీఫ్, శ్రీనివాసరెడ్డి,శేఖర్ రెడ్డి,హనీఫ్, మౌలాలి,ఓబయ్య,టిఎన్‌ఎల్ పుల్లయ్య,ఇండ్ల లక్ష్మిరెడ్డి,రమణారెడ్డి,సూర్యనారాయణ,సాయినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా టైలర్స్ దినోత్సవం



ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఎమ్మిగనూరు టౌన్,మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. తాలూకా టైలర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మంత్రాలయం టీడీపీ ఇంచార్జి పాలకుర్తి తిక్కారెడ్డి తనయుడు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి చేతులు మీదుగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రేడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ టైలర్స్ కు అన్ని విధాలుగా అండగా ఉంటామని, వారి అభ్యున్నతికికృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగభూషణం,నిస్సార్ అహ్మద్, నజీర్, ఉరుకుందు, అమ్రేష్ గౌడ్,సలిం, ఈరన్న, పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాలు పంపిణీ



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ ఎమ్మార్వో

**పాములపాడు, మేజర్ న్యూస్ :** పాములపాడు మండల పరిధిలోని చెలిమిళ్ళ గ్రామంలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమానికి వైసిపి మండల అధ్యక్షుడు రామలింగేశ్వర్ రెడ్డి, హాజరై ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లా డుతూ జగనన్న సంక్షేమ పథకాలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉండిపోతారని అన్నారు మళ్లీ అవకాశం ఇచ్చి గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో హరాన్ బాబు, గ్రామ సర్పంచ్ కోట్ల చంద్రారెడ్డి, తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాద్ , ఎంపిటిసి సురేష్ , మాజీ సర్పంచ్ విజయసింహారెడ్డి మధుసూదన్ రావు, గోపాల్‌విఆర్ఓ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుతో తీరనున్న దాహార్తి

**మళ్లీవేముల సమీపంలో దాహార్తి కోసం నిలువ ఉంచిన త్రాగునీరు నీటిని శుద్ధి చేసి నిలువ ఉంచడానికి ఏర్పాటు చేసిన సంపు శుద్ధి చేసేందుకు వాడుతున్న యంత్రాలు**



త్రాగునీటి కోసం శుద్ధి చేస్తున్న దృశ్యం

**చాగలమర్రి ,మేజర్ న్యూస్ :** వేసవికాలం ఆరంభంలోనే త్రాగునీటి కోసంఇక్కట్లు మొదలయ్యాయి. ఈఏడాదివర్షాలు సక్రమంగా కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి ఉన్న నీటి వనరులు సైతం ఇంకిపోవడంతో బోర్లలోనీరు రాక ఇబ్బందులు గురవుతున్నాయి. ఇందుకోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధానమంత్రి పీవీ నరసింహారావు మలివేముల సమీపంలోని సమ్మర్ స్టోరీ స్టాంకును నిర్మించారు. గతనాలుగు సంవత్సరాలలో వర్షాలు సకాలంలో కురిసి భూగర్భలు నీరు అధికంగా ఉండడంతో రాకుండా సంబంధిత అధికారులు చూశారు. ఈ ఏడాది వర్షాలు అడపాదడపా పడడంతో భూగర్భంలో నీ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతో సాగునీటి కోసం, త్రాగునీటి కోసం ఎద్దడి ఏర్పడింది. ప్రభుత్వం నీటి ఎద్దడి నివారించేందుకు మండలంలోని మల్లె వేముల సమీపంలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నీటిని శుద్ధి చేసి మండలంలోని చెట్టివీడు గొడిగనూరు, చాగలమర్రి గ్రామాలకు సరఫరా చేస్తుంది. రక్షిత త్రాగునీటిసరఫరా అధికారులు, కాంట్రాక్టర్ కు నిధులు మంజూరు చేయించి తాగునీటి కోసం ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి అభివృద్ధి నిధి కింద అదనపు బోర్లను వేసి త్రాగునీటి నీ క్లోరిన్ చేసి నీటిని సంపు చేసి నీటి ఎద్దడి నివారించేందుకు సంబంధిత అధికారులతో పాటు కాంట్రాక్టర్ నజీర్ , సంబంధిత శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. మండలంలో మలివేముల సమీపంలోని సమ్మర్ స్టోరేజీ పై వెలసిన కంపచెట్లను, ఇతర చెట్లను తొలగిస్తున్నామన్నారు వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని రక్షిత మంచినీటి సరఫరా శాఖ అధికారి జగ్గయ్య తెలిపారు.

# నీటి సమస్యను తీర్చండి..

**వైసిపి మండల అధ్యక్షుడు రామలింగేశ్వర్ రెడ్డి**



అధికారులతో మాట్లాడుతున్న రామలింగేశ్వర్ రెడ్డి

**పాములపాడు, మేజర్ న్యూస్ :** మిట్ట కందల గ్రామ ప్రజల నీటి సమస్యను తీర్చాలని తీర్చాలని మండల అధ్యక్షుడు రామలింగేశ్వర రెడ్డి ఎస్ ఈ మనోహర్ డిఈ సాగర్ లను కోరారు బుధవారం నాడు అధికారులతో కలిసి గ్రామంలోని బోర్లను పరిశీలించారు అనంతరం చెడిపోయిన మోటార్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని అదేవిధంగా గ్రామంలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలని అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతల నారాయణ తుమ్మలూరు సర్పంచ్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీవాణి స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు



సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న డిప్యూటీ డీఈవో హనుమంతరావు

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** నందికొట్కూరు పట్టణంలోని శ్రీవాణి స్కూల్ ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదిన సర్ సీవీ రామన్ పుట్టిన రోజున సైన్స్ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ. శాస్త్ర సాంకేతిక రంగంలో దేశ ఔనత్యాన్ని చాటిన మహనీయుడని సీవిరామన్ అని, సీవీ రామన్ స్పూర్తితో విద్యార్థులు పరిశోధనలో రాణించి నూతన అంశాలను ఆవిష్కరించాలని డిప్యూటీ డిఈవో హనుమంతరావు శ్రీవాణి స్కూల్ విద్యార్థుల సైన్ దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం సీవీరామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీవాణి స్కూల్ విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రదర్శనను తిలకించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కరెస్పాండెంట్ నిర్మలాదేవి మాట్లాడుతూ సీవీరామన్ దినోత్సవ వేడుకలను మా స్కూల్‌లో జరపడం చాలా ఆనందదాయకంగా ఉందని విద్యార్థులు నిర్వహించిన సెమినార్ పవర్ ప్రెజెంటేషన్ విద్యార్థుల్లో స్పూర్తిని నింపిందని మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సైన్స్ అంశంలో దృష్టిసారించి పరిశోధనలు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరు మైనార్టీలు అంతా బీవీ వైపే

**టీడీపీ మైనార్టీ నాయకులు**



**ఎమ్మిగనూరు టౌన్,మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు నియోజకవర్గ మైనార్టీలు మాజీ ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డి వైపే ఉన్నారని, మాజీ మంత్రి బీవీ. మోహన్ రెడ్డి, ఆ తర్వాత జయనాగేశ్వర రెడ్డి మైనార్టీలను రాజకీయంగా కీలక పదవులు ఇచ్చి ముందుకు తెచ్చిన ఘనత వారికే దక్కిందని టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఉసేన్ సాబ్, ప్రధాన కార్యదర్శి తురెగల్ నజీర్ అహమ్మద్‌లు పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.. ఎమ్మిగనూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పదంలో తీసుకెళ్లిన ఘనత బీవీ కుటుంబానికే దక్కిందాన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో బీవీని గెలిపించి చంద్రబాబు నాయుడుకు కానుక అందిస్తాన్నారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు హాజీ బడేసాబ్, సలీం, నవాజ్, గౌస్, ఇర్ఫాన్, అబ్దుల్లా, మాబు, ఆటో సుభాన్, తదితరాలు పాల్గొన్నారు.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

**అవుకుమేజర్,న్యూస్ః** అవుకు పోలీస్ స్టేషన్ పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో గల సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు సిఆర్‌పిఎఫ్ బలగాలు త్వరలో రానున్న సందర్భంగా వారు ఉండుటకు కావలసిన వసతి సౌకర్యాలను బనగానపల్లె పట్టణంలోని ఒక కళాశాలను పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో హింసాత్మక సంఘర్షణలు చెలరేగినప్పుడు వీటి ఆవశ్యకత ఎక్కువగా ఉంటుంది. ఎన్నికలు దగ్గర పడుతున్న సందర్భంగా ఎలాంటి భయాలకు లోనుకాకండా ఉండాలని మరియు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా పోలీసు వారికి పూర్తిగా సహకరించాలని సమస్యలు సృష్టించుకొని పోలీసు చర్యలకు గురి కాకూడదని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నింధనలు పాటించాలని ప్రతి ఒక్కరూ మోటారు సైకిల్‌పై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలియజేశారు. అంతేకాక సైబర్ నేరాలు జరుగుతున్న సందర్భంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని మీయొక్క వ్యక్తిగత వివరాలను ఓటీపీలను ఎవ్వరికీ షేర్ చేయవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో డోన్ డీఎస్పీ వై. శ్రీనివాస రెడ్డి, బనగానపల్లె ఎస్.ఐ తిమ్మారెడ్డి, అవుకు ఎస్.ఐ కిరన్ బాబు సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

# యాగంటిపల్లె ఉన్నత పాఠశాలలో సైన్స్ డే ఎగ్జిబిషన్



సైన్స్ ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న ఉపాధ్యాయుడు పుల్లారెడ్డి

**బనగానపల్లెరూరల్, న్యూస్ః** బనగానపల్లె మండల పరిధిలోని యాగంటిపల్లె ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవంగా సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పాఠశాలస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల మోడల్స్ పరిశీలించి గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పబ్జెక్టుపట్ల ఆసక్తి పెంపొందించుకొని భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగాల్లో మరీ ఎక్కువగా పేరు పొందే విధంగా ప్రయోగాలను చేసి పాఠశాల నుండి శాస్త్రవేత్తలుగా తయారు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైన్స్ ఉపాధ్యాయురాలు సివి రామన్ జీవిత విశేషాలను వివరించారు.

# కేశవరెడ్డిలో ఘనంగా జాతీయ సైన్స్ డే వేడుకలు



నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** నగరంలోని అన్ని కేశవరెడ్డి పాఠశాలల్లో బుధవారం 96వ జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ నుంచి 10వ తరగతి విద్యార్థు అన్ని సబ్జెక్టుల నుంచి వివిధ నమూనాలను ప్రదర్శించారు. ఇందులో లైఫ్ ప్రాసెసింగ్, గ్లోబల్ వార్మింగ్, చంద్రయాన్-3, క్షేత్రగణితం, కంజుమర్ కోర్టు మొదలైన మోడల్ ఎగ్జిబిషన్లు నిర్వహిచారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి పాఠశాలల వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.కేశవరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవని 28న దేశంలో జాతీయ సైన్స్ డే వేడుకలు జరుపుకుంటారన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కేశవరెడ్డి పాఠశాలలు ఎల్లప్పుడు ముందుంటాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు, ఉపాధ్యాయులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

సూర్య



# వైజ్ఞానిక ప్రదర్శనలతో విజ్ఞానం..!



ప్రదర్శన తిలకిస్తున్న డాక్టర్ మల్లికార్జున

**ఎమ్మిగనూరు టౌన్,మేజర్ న్యూస్ :** వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థులు మరింత విజ్ఞానాన్ని పొందవచ్చని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్‌మల్లికార్జున, మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక భాష్యం స్కూల్ లో ప్రిన్సిపాల్ మాచాని కవిత అద్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విజ్ఞాన శాస్త్రప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మానవ జీవితంలోకి సైన్స్ వచ్చిన తర్వాత ఎన్నో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యార్థులు ప్రతి విషయాన్ని సొంతంగా ఆలోచించి తమలో దాగివుని నైపుణ్యాలను వెలికి తీయాలని సూచించారు. దేశం అభివృద్ధి సాధించాలంటే సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం పురోగమించాలని తెలిపారు. అనంతరం ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది అనురాధ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# గోనెగండ్లలో ఘనంగా జాతీయ సైన్స్ డే



మాట్లాడుతున్న హెచ్‌ఎం. నాగభూషణం

**గోనెగండ్ల,మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ డేను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. డాక్టర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం మాట్లాడుతూ సీవీ రామన్ ఎఫెక్ట్ గురించి వివరించార సైన్స్ అభివృద్ధి తోనే దేశ ప్రగతి ఉంటుందని అందరు శాస్త్రీయ ఆలోచనలతోనే ముందు కు వెళ్లాలని కోరారు. పలు శాస్త్ర వేత్తల జీవిత విశేషాలను ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేష్, మురళి, తాజుద్దీన్, ఖాదర్బాషా, రామచంద్రరావు, అమానుల్లా బేగ్, ప్రమీలాబాయి, సలీం బాషా, బాస్కర్, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లాలో పార్లమెంట్, రెండు అసెంబ్లీలు కురువలకు ఇవ్వాలి

**-చంద్రబాబుకు కురవ సంఘం నాయకుడి వినతి**



మాజీ సీఎం చంద్రబాబును కలిసిన రామకృష్ణ

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** ఈ సార్వత్రిక ఎన్నికలలో కర్నూలు జిల్లాలో ఒక పార్లమెంట్ స్థానం, రెండు అసెంబ్లీ స్థానాలు కురువలకు కేటాయించాలని జిల్లా తెలుగుయువత మాజీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర కురువ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ మాజీ సీఎం చంద్రబాబును కోరారు. బుధవారం విజయవాడంలోని ఉండవల్లిలో చంద్రబాబు నివాసంలో ఆయన ను కలిశారు. రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకుడు శ్రీరాములు చంద్రబాబు సమక్షంలో టీడీపీ లో చేరిన సందర్భంగా ఆదిష్టానం పిలుపు మేరకు జేఏసీ నాయకలు కలిశారు. అందులో బాగంగ రామకృష్ణ చంద్రబాబును కలిశారు. కర్నూలు జిల్లాలో కురువ కుల సామాజిక వర్గం గురించి వివరించారు. పార్లమెంట్ రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని చంద్రబాబును కోరారు. అలాగే ఎమ్మిగనూరు నియోజక వర్గ సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం కోసం ఆహర్నిశం కృషి చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారని రామకృష్ణ తెలిపారు.

# అహోబిలేశున్ని దర్శించుకున్న కంచి పీఠాధిపతి

**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** విజయ యాత్ర లో భాగంగా కంచి పీఠాధిపతి విజ యేంద్ర సరస్వతి స్వామి పారువేటలో భాగంగా రుద్రవరంలోఉన్న ప్రహల్లా ద వరుడు, జాల నరసింహ స్వామి ఉత్సవమూర్తులను బుధవారం సాయ ంత్రం దర్శించుకున్నారు.ఆయన రాక ను పురస్కరించుకొని అహోబిలం జిపిఏ సంపత్ ప్రధాన అర్చకులు వేణుగోపాలం ఓఎస్డి శివప్రసాదులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కంచి పీఠాధిపతి విజయేం ద్ర సరస్వతి స్వామి ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించారు. విజయ యాత్రలో భాగం గా ఆళ్లగడ్డ పట్టడానికి సోమవారం సాయంత్రం కంచి పీఠాధిపతి రావడం జరిగింది. ఆయనమూడు రోజులపాటు గాయత్రి మాత ఆలయంలో ఉండి చంద్రమౌళీశ్వర పూజలు, భక్తులకు అను గ్రహ భాషణం చేశారు. బుధవారం సాయంత్రం ఆయన అహోబిలం దర్శనానికి వెళ్లడం జరిగింది. రాత్రి అహోబిలంలోనే బస చేసి గురువారం ఉదయం కంచి పీఠాధిపతి అహోబిలం నుండి కడపకు వెళ్ళనున్నారు.



# వైసీపీ నుండి తెలుగుదేశం పార్టీలోకి భారీ చేరికలు

**మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో పీరుసాహెబ్‌పేట మాజీ జడ్పీటీసీ, బీసీ నాయకుడు చేరిక**



బీసీ నాయకున్ని టీడీపీ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాండ్ర

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** మిడ్తూరు మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలో వైసీపీ చెందిన దాదాపు 50 కుటుంబాలు నంద్యాల పార్లమెంటు టీడీపీ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో మరియు మిడ్తూరు మండల టీడీపీ కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మరియు టీడీపీ సీనియర్ నాయకులు సోమసుందర్‌రెడ్డి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్ గుండం రమణారెడ్డి,కె.పుల్లారెడ్డి ఆధ్వర్యంలో పీరుసాహెబ్ పేటకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు దేవమాడ జయరాముడు,మాజీ జడ్పిటీసీ జయమ్మ, ఎల్లనాగన్న, బక్కిరెడ్డి గారి చిన్న భద్రారెడ్డి, వీరారెడ్డి, గోపాల్‌రెడ్డి, రామాంజనేయులు, ఆంజనేయులు, నాగేశ్వరరావు, ఎల్లానాగన్న, షఫి, సుధాకర్, నాగేశ్వరరావు, మహమ్మద్, రఫి, ఖాజావలి, తెలుగు నీలకంఠం, అథావుల్లా, విజయ్‌కుమార్, ఎల్లా నాగిరెడ్డి తదితర 50 కుటుంబాలు తెలుగు దేశం పార్టీలో చేరారు. వీరికి మాండ్ర శివానందరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరికి సమీపిస్తుండడంతో గ్రామాలలో వైసీపీ పార్టి కనుమరుగు అవ్వాలని ఆయన కోరారు. అనంతరం వడ్డె జయరాముడు మాట్లాడుతూ బీసీలకు సముచిత స్థానం టీడీపీతోనే సాధ్యమని జగన్‌మోహన్‌రెడ్డి అవలంభించిన పథకాల వల్ల గ్రామాలలో చాలా నష్టపోయామని మా గ్రామంలో టీడీపీలో ఉచిత ఇసుక విధానం ఉండేదని జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఇసుక విధానం రద్దు చేస్తే దాదాపుగా వడ్డెర కుటుంబాలు నష్టపోయాయని జీవనోపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభత్వం వస్తే ఉచిత ఇసుక విధానం వస్తుందని జగన్ అబద్దపు మాటలు నమ్మి మోసపోయామని ప్రతికార్యకర్త సైనికుల్లా పనిచేసి టీడీపీకి ఓటు అనే ఆయుధంతో జగన్‌కు బుద్ధి చెప్పాలని అన్నారు. నాతో పాటు దాదాపు 50 కుటుంబాలు టీడీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గుండం రమణారెడ్డి,రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రతినిధి గిత్తా జయసూర్య,వంగాలశివరామిరెడ్డి,దెరెడ్డి మహేశ్వరరెడ్డి, ఎం.మహేశ్వర రెడ్డి, మహానంది గారి మహేశ్వరరెడ్డి,బీసీ నాయకుడు గట్టు రవి,డీలర్ లక్ష్మి నారాయణ,యువజన విభాగం టీడీపీ నాయకుడు యరబం ప్రమోదరెడ్డి,మైనార్టీ నాయకులు,సుభాన్,చాంద్‌బాషా,తదితర టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తా



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ,మేజర్‌న్యూస్ :** ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న తాగునీటి సమస్య మున్సిపల్ కమిషనర్ పరిష్కరించకపోతే గురువారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తానని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని ఆచారి కాలనీలో బుధవారం భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆళ్లగడ్డ మున్సిపాలిటి పరిధిలో త్రాగునీటి సమస్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. సమస్యను పరిష్కరించకపోతే మున్సిపాలిటీ కార్యాలయం వద్ద తాను ధర్నా చేస్తానని అన్నారు. మున్సిపల్ కమిషనర్ సమస్య పరిష్కరించకుండా తప్పించుకొని తిరుగుతే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామన్నారు. అలాగే జిల్లా కలెక్టరేట్ వద్ద కూడా త్రాగునీటి కోసం ధర్నా చేస్తామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే విజయవాడలో ఉంటూ రాజకీయాలు చేయడం అలవాటైపోయిందన్నారు.ఎమ్మెల్యే దమ్ముంటే ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆళ్లగడ్డకు ఇస్తానన్న 100 కోట్ల రూపాయల నిధులను తీసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, నాయకులు రామాచారి, శ్రీనివాస్ రెడ్డి, నూర్జహాన్ పాల్గొన్నారు.

# క్రిష్ణగిరిలో నాల్గవ విడత ఆసరా సంబరాలు

**క్రిష్ణగిరి,మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన క్రిష్ణగిరి గ్రామంలో ఆసరా నాల్గవ విడత కింద చెక్కులు మంజూరైన రూ.1.87కోట్ల చెక్కును పొదుపు సంఘాల సభ్యులకు పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,2019 ఎన్నికల కంటే ముందుగా పొదుపు మహిళలకు రూ.25.571కోట్ల అప్పులను తాము అధికారంలోకి రాగానే నాలుగు దఫాలుగా విడుదల చేస్తామని చెప్పిన వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆ హామీని పూర్తిగా నెరవేర్చారని ఆమె అన్నారు.క్రిష్ణగిరి మండలంలో నాల్గవ విడత కింద ఆసరా నిధులను 416 గ్రూపులకు గాను 4088 సభ్యులకు ఉండగా విడుదలైన 1.87 కోట్ల నిధులను విడుదల అయ్యాయని ఆమె తెలిపారు.క్రిష్ణగిరి మండలంలోని రూ.7.51 కోట్ల నగదును పొదుపు మహిళలకు ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.పత్తికొండ నియోజకవర్గానికి ఆసరా పొదుపు సంఘాలకు మొత్తం రూ.73 కోట్ల నిధులను అక్క,చెల్లెమ్మలకు చెల్లించామన్నారు.ఈ కార్యక్రమంలో క్రిష్ణగిరి ఎంపిపి డాక్టర్ కంగాటి



వెంకట రామిరెడ్డి, జడ్పిటీసీ సభ్యురాలు కె.యి సుభాషిణి,నాయకులు బ్రహ్మానందరెడ్డి,మాధవరావు,వైస్ ఎంపిపి సుశీల, ఎంపిటీసీ సభ్యురాలు మహాలక్ష్మి,కో..ఆప్షన్ సభ్యులు నక్కశాలు,పలువురు సర్పంచులు,ఎంపిటీసీ సభ్యులు ,పొదుపు సంఘాల మహిళలు ఇంకా పలువురు వైసీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి ఆదేశాల జాతీయ సైక్లు దినోత్మకం కస్తురుబా గాంధీ బాలికల విద్యాలయ కేజీబీవీ చాగలమర్రి నందు జిల్లా దీర్ఘా కోఆర్డినేటర్ నాగేంద్రకుమార్, స్పెషల్‌ఆఫీసర్ సునిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భాన్ని సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త సర్ సి.విరామన్ గజవిల్ విశేషాలను విద్యార్థులు వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించారు. చిత్ర లేఖనం సైన మోడల్స్ ప్రదర్శన నిర్వహించారు. మండల విద్యాధికారులు అనురాధ, న్యాయతుళ్ళా స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ జివయ్య హాజరయ్యారు. విద్యార్థులు ప్రతి విషయాన్ని క్షణంగ అర్థం చేసుకొని సమజంలోనీ సమస్యలపై పరిగోదనలు నిర్వహించి వాటికి పరిష్కారాలు సూచించే 875 బాల శాస్త్రకర్తలుగా ఎదగాలని మండల విద్యాశాఖ అధికారి అనురాధ అన్నారు. వినూత్న శాస్త్ర పరిశోధనలు, దేశ ప్రగతికి, దేశ రక్షణకు మెరుగైన, సౌకర్యవంతమైన. ఆరోగకరమైన జీవితాన్ని అందించడానికి ఉపయోగించాలని మరో మండల విద్యాశాఖ అధికారి న్యాయమతుల్లా అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యాసరచన చిత్రలేఖనం, సైన్స్ మోడల్స్ మోడల్స్ పై పరీక్షలు నిర్వహించారు. విజేతలైన విదార్థులకు సర్టిఫికెట్, ఒపుకుతులు అంద శిశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మైకెల్ విజయ రాజు, హుస్సేన్ నాగలక్ష్మి, ఇతర సబ్జెష్ట ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం



# నంద్యాల పార్లమెంట్ ఖిల్లా... బడుగుల జిల్లా

# టికెట్లివ్వని పార్టీలపై బడుగుల కన్నెర్ర

- రాబోయే ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న బడుగులు
- ఒకే సామాజిక వర్గానికి అండగా నిలుస్తున్న రాజకీయ పార్టీలు
- వైకాపాదీ అదే దారి... తెదేపా రహదారీ అదే
- బడుగుల నుండి బలమైన నేతలున్నా పట్టించుకోని పార్టీలు
- ద్వితీయ శ్రేణికి పరిమితమైన బడుగు నేతలు
- అన్ని చోట్లా అన్యాయమే

ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి విడిపోయి ప్రత్యేక జిల్లాగా మారిన నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గంలో ఒకే సామాజిక వర్గం పెత్తనం చేస్తోంది. ఈ పార్లమెంట్ నియోజకవర్గ రాజకీయ చరిత్రలో ఆ సామాజిక వర్గానిదే పై చేయిగా మారింది. బడుగులు బలంగానే ఉన్నా అధికార పీఠమెక్కేందుకు వారికి ఏ రాజకీయ పార్టీ అండగా నిలవలేకపోతోంది. చిన్న చితకా పదవులు కట్టబెట్టి ప్రధాన పదవులను ఒకే సామాజిక వర్గానికి కట్టబెడుతున్నాయి ఆయా రాజకీయ పక్షాలు. బడుగులకు తామే న్యాయం చేశామంటూ గొప్పలు చెప్పుకుని సొంత డబ్బా కొట్టుకునే రాజకీయ పక్షాలు బడుగుల పక్షాన నిలబడలేకపోతున్నాయి. ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాజకీయంగా బలంగా ఉన్న రెడ్డి సామాజిక వర్గానికే అన్ని పార్టీలు పెద్ద పీట వేస్తున్నాయి. వారిని కాదని మరొకరికి టికెట్ ఇవ్వడం ఆయా రాజకీయ పార్టీలకు కూడా సవాలేననడంలో సందేహం లేదు. అంతలా రాజకీయాలతో ఆ సామాజిక వర్గం పెనవేసుకుపోయింది. ఎవరు ఔనన్నా... కాదన్నా వారిని కాదని మరొకరు బరిలో దిగేందుకు కూడా సాహసించని జిల్లా ఏదైనా ఉందా? అంటే నంద్యాల జిల్లానేనన్నది ఇట్టే చెప్పేస్తారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు నేతలుగా ఎదిగినా వారంతా ఎప్పుడూ ద్వితీయశ్రేణి నాయకులుగా ఉండిపోవలసిన దుస్థితి ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో నెలకొంది. బడుగు, బలహీన వర్గాలు బలంగా ఉన్నా అచేతనావస్థలోకి నెట్టబడ్డారు. ఎవరో ఒకరికి అనుచరులుగా ఉండడం తప్ప శాసనసభలో అడుగు పెట్టడమనే మాటకు దూరంగా ఉంటూ వస్తున్నాయి బడుగు, బలహీన వర్గాలు. దేశానికి రాష్ట్రపతిని, రాష్ట్రానికి ముఖ్యమంత్రులను అందించినా బడుగు వర్గాలకు చెందిన వారెవరూ కనీసం శాసన సభలో అడుగు కూడా పెట్టలేకపోయారంటే ఇక్కడి రాజకీయాలపై ఆ సామాజిక వర్గం ఎంతలా బలమైన ముద్ర వేసిందన్నది వివరించాల్సిన అవసరం లేనిది. వివరించేందుకు తెలుగు అక్షరమాల సరిపోకపోవచ్చు. 2024 ఎన్నికల్లోనూ మరోమారు గతంలోని పరిస్థితులు పునరావృతమవుతున్నాయి.

కర్నూలు, మేజర్‌న్యూస్‌బ్యూరో

అధికార వైకాపా, ప్రతిపక్ష తెదేపాలు దాదాపు ఒకే సామాజిక వర్గానికి పట్టం కట్టేందుకు సిద్ధమయ్యాయి. 7 నియోజకవర్గాలున్న నంద్యాల పార్లమెంట్‌లో ఆరు అసెంబ్లీ స్థానాలకు తెదేపా ఇటీవలే అభ్యర్థులను ఖరారు చేసింది. ఇందులో నంద్యాల నుండి ఎన్ఎండి ఫరూక్ ఒక్కరికే మైనారిటీ కోటాలో టికెట్ దక్కగా, మిగిలిన వారంతా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడం విశేషం. కాంగ్రెస్‌పార్టీ బడుగులకు స్థానం కల్పించి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇస్తోంది. రాష్ట్ర విభజనకు ముందు బలమైన రాజకీయ పక్షంగా ఉన్న కాంగ్రెస్‌పార్టీ ఆనాడు ఒకే సామాజిక వర్గానికి పెద్ద పీట వేసిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గంలో 14లక్షల మందికి పైగా ఓటర్లుండగా, ఇందులో బడుగులకు 5లక్షల దాకా ఓట్లున్నాయి. అయినా, ఆయా సామాజిక వర్గాలకు టికెట్ల కేటాయింపులో న్యాయం జరగడం లేదు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు బడుగు వర్గాలు సిద్ధమవుతున్నాయి. తమకు టికెట్లు ఇవ్వకుండా తమ ఓట్లతో అందలం ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న రాజకీయ పక్షాలను ఎదుర్కొనేందుకు బడుగు వర్గాలు సిద్ధమవుతున్నాయి. తమను నిర్లక్ష్యం చేస్తున్న పార్టీలకు గుణపాఠం చెప్పేందుకు అవి సిద్ధమవుతున్నాయి. ఆయా రాజకీయ పార్టీలపై తిరుగుబాటు జండా ఎగురవేసేందుకు సిద్ధమవుతున్నాయి. తాము కన్నెర్ర చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందో చూపించేందుకు బడుగులు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల శంఖారావం మోగనున్న నేపథ్యంలో నంద్యాల జిల్లాలోని బడుగునేతలను గుర్తుకు చేసే ప్రయత్నం చేస్తోంది నేటి దినపత్రిక సూర్య.



## బడుగుల ప్రతినిధిగా నిలబడ్డ కెఇ ప్రభాకర్ ( ఈడిగ, తెదేపా)

ఉమ్మడి కర్నూలు జిల్లాలో బడుగులకు ప్రతినిధిగా నిలబడ్డారు మాజీ మంత్రి కెఇ ప్రభాకర్. ఈడిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన డోన్, పత్తికొండ నుండి ఎమ్మెల్యేగా గెలిచారు. చంద్రబాబునాయుడు మంత్రి వర్గంలో మంత్రిగా కూడా పని చేసిన అనుభవం ఆయనది. 2024 ఎన్నికల్లో పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నారు. అయితే, ఇంటికి ఒకరికే టికెట్ అన్న నిబంధన ఆయనకు అడ్డంకిగా మారే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో పెద్ద రాజకీయ కుటుంబ ం నుండి వచ్చిన ఆయన సీనియర్ రాజకీయ నాయకుడు, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు, రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి సోదరుడు. ప్రస్తుతం కెఇ కృష్ణమూర్తి కుమారుడు కెఇ శ్యాంబాబుకు పత్తికొండ నుండి పోటీ చేసేందుకు తెదేపా అవకాశం ఇచ్చింది.



## ఆళ్లగడ్డ నుండి మరోమారు పోటీకి సై అంటున్న పుల్లయ్య (చాకలి, కాంగ్రెస్‌పార్టీ)

చాకలి సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పుల్లయ్య ఆళ్లగడ్డ నియోజకవర్గం నుండి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగబోతున్నారు. 2019 ఎన్నికల్లోనూ ఆయన పోటీ చేశారు. 2012 నుండి 2013 వరకు గోస్పాడు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఆయన పని చేశారు. 2015 వరకు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా, 2013 నుండి 2014 వరకు ఎపిహెచ్ఎంహెచ్ఐడిసి డైరెక్టర్‌గా పని చేశారు. 2017 నుండి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా ఉన్నారు. ప్రస్తుతం నంద్యాల జిల్లా కాంగ్రెస్‌పార్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి, పిసిసి సభ్యునిగా కూడా ఉన్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి ఆళ్లగడ్డ నుండి పోటీ చేసేందుకు సమాయత్తమవుతున్నారు.



## మరోమారు పోటీకి సిద్ధమవుతున్న చింతల మోహన్‌రావు (యాదవ, కాంగ్రెస్‌పార్టీ)

యాదవ సామాజిక వర్గానికే చెందిన మరో నేత డాక్టర్ చింతల మోహన్‌రావు. 2019లో ఆయన కాంగ్రెస్‌పార్టీ టికెట్ నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుండి తొలిసారి పోటీ చేశారు. 2024 ఎన్నికల్లోనూ మారోమారు పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. నంద్యాల పట్టణంలోని సరస్వతి నగర్‌లో నివాసం ఉంటున్న ఆయనకు రాజకీయాలంటే ఆసక్తి. 2019కు ముందు ఆయన కాంగ్రెస్‌పార్టీలో చేరారు.



## ఎక్కడైనా పోటీకి సిద్ధమంటున్న లక్ష్మీనరసింహయాదవ్ (యాదవ/కాంగ్రెస్‌పార్టీ) కాంగ్రెస్‌పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు

యాదవ సామాజిక వర్గానికి చెందిన నంద్యాల జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మరోమారు నంద్యాల పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు లక్ష్మీనరసింహయాదవ్. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్యను 2003లో ఏర్పాటు చేసిన ఆయన 2014 వరకు విద్యార్థిరంగ ఉద్యమాల్లో పాల్గొన్నారు. విద్యార్థి రంగంలో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ఆయన స్థాపించిన విద్యార్థి సంస్థ ముందుండి పోరాటాలు చేసింది. 2014లో పాణ్యం నియోజకవర్గం నుండి కాంగ్రెస్‌పార్టీ టికెట్ ఆశించిన ఆయన అక్కడ నుండి గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసిన సమైక్యాంధ్ర పార్టీ నుండి పోటీ చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌పార్టీలో చేరిన లక్ష్మీనరసింహ యాదవ్ 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నంద్యాల ఎంపి అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆ తర్వాత నంద్యాల జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షునిగా నియమితులయ్యారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఆ పదవిలో కొనసాగుతున్నారు. 2024లోనూ నంద్యాల ఎంపి స్థానానికి కాంగ్రెస్‌పార్టీ టికెట్‌పై పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.



## ఎక్కడి నుండైనా సై అంటున్న నాగేశ్వరరావు యాదవ్ (యాదవ/తెదేపా)

యాదవ సామాజిక వర్గానికి చెందిన మరో నేత నాగేశ్వరరావు యాదవ్. సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉంటున్న ఆయన తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. రాబోయే ఎన్నికల్లో ఎక్కడి నుండి టికెట్ ఇచ్చినా పోటీ చేసేందుకు ఆయన సన్నద్ధంగా ఉన్నారు. తెదేపాలో రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగినా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయనకు అవకాశాలు దక్కలేదు. డోన్ నియోజకవర్గ పరిధిలోని ప్యాపిలి జడ్పీటీసీ సభ్యునిగా ఆయన రెండుసార్లు ఎన్నికయ్యారు. డోన్ నియోజకవర్గ పరిధిలోని ప్యాపిలి మండలం చంద్రపల్లె గ్రామానికి చెందిన నాగేశ్వరరావు యాదవ్ ఎపి స్టేట్ షీప్ ఫెడరేషన్ చైర్మన్‌గా ఉంటున్నారు. బిసి సంక్షేమ సంఘానికి రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షీప్ బ్రీడర్ కో-ఆపరేటివ్ యూనియన్‌కు అధ్యక్షునిగా కూడా పని చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో కీలకంగా ఉన్న యాదవ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా శాసనసభకు వెళ్లేందుకు ఇప్పటి వరకు అవకాశాలైతే దక్కలేదు. పోటీ చేసేందుకు సిద్ధమంటున్నా బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండే పార్టీగా చెప్పుకునే తెదేపా అధిష్టానం కూడా పట్టించుకోవడం లేదు.



## అధిష్టానం ఆదేశిస్తే దేనికైనా సిద్ధం : మల్లెల రాజశేఖర్ గౌడ్ (ఈడిగ, తెదేపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు)

అధిష్టానం ఆదేశిస్తే ఏ ఎన్నికల్లోనైనా పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని నంద్యాల జిల్లా తెదేపా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్ (ఈడిగ) చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో తెదేపా అధికారంలోకి వచ్చిన సమయంలో కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఆయన వ్యవహరించారు. వైకాపా నుండి జడ్పీటీసీగా ఎన్నికై అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో తెదేపాలో చేరిన ఆయనను జడ్పీ చైర్మన్ పదవి వరించింది. తెదేపాలో చేరినప్పటి నుండి అధినేత చంద్రబాబునాయుడుకు నమ్మినబంటులా ఉంటున్నారు. ఆ కారణంగానే పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని మరొకరికి ఇవ్వాలంటూ గౌరు వెంకటరెడ్డి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు ఆయన స్థానంలో మల్లెల రాజశేఖర్ గౌడ్‌ను ఎంపిక చేశారు. చిన్న వయసులోనే ఆయనను జడ్పీ చైర్మమన్ పదవి వరించింది. కీలకమైన ఎన్నికల సమయంలో జిల్లా తెదేపా అధ్యక్ష పదవి ఆయనకు దక్కింది.

సూర్య
గురువారం | 29 ఫిబ్రవరి 2024



టైలర్స్ డే సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుదేశం అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్

## టైలర్స్‌కు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం

### – ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, పట్టణ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ టైలర్స్ డే పురస్కరించుకుని సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం అభ్యర్థి మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటయ్యాక టైలర్ల సమస్యలను పరిష్కరిస్తామని, టైలర్స్ కమ్యూనిటీ హాల్‌కు స్థలాన్ని కేటాయిస్తామని, 200యూనిట్లు కరెంటు ఫ్రీ, 50సంవత్సరాలు దాటి టైలర్స్‌కు పింఛన్లు, ఇంటి స్థలం తదితర సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. అనంతరం తల్లిదండ్రి లేని ఒక పపేద మహిళకు దాత రాఘవేంద్ర ఎంటర్ ప్రైజేస్ యజమాని రవి కుట్టుమిషన్‌ను ప్రీగా పంపిణీ చేశారు. ఈమిపదిమందికి సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లా టైలర్ల అసోసియేషన్ అధ్యక్షులు సుభాన్, గౌరవాధ్యక్షులు షఫిఉల్లా, ఉపాధ్యక్షులు ఖాదర్, ప్రధాన కార్యదర్శి హాసన్, ఖాన్, సత్తార్, షబ్బీర్, పట్టణ టైలర్స్ అధ్యక్షులు శేఖర్, ఉపాధ్యక్షులు మహబూబ్‌బాషా, ఉపాధ్యక్షురాలు ముంతాజ్ బేగం, ప్రధాన కార్యదర్శి రవికుమార్, శ్రీనివాసులు, ఆనందరావు, బసవరాజు, భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్రలో సైన్స్ ఎక్స్‌పో



మాట్లాడుతున్న పుల్లయ్య

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కల్లూరు అర్బన్ పరిధిలోని రవీంద్ర విద్యాసంస్థల్లో బుధవారం డాక్టర్ సివి.రామన్ జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిధిగా రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య హాజరై మాట్లాడుతూ మారిపోతున్న జీవన విధానంలో నేడు అనేక రకాలు జబ్బులు వస్తున్నాయన్నారు. ఈ వ్యాధులన్నీ రావడానికి కారణం మానవతప్పిదాలు అన్నారు. వాటిని ముందుగానే పసిగట్టి నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతామోహన్, వైస్ చైర్మన్ వంశీధర్, పాఠశాల సమన్వయకర్తలు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓంకార క్షేత్రంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు



**బండిఆత్మకూరు, రూరల్ మేజర్‌న్యూస్ :** మార్చి 7వ తేది నుండి ప్రముఖ పుణ్యక్షేత్రం ఓంకార దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఛైర్మెన్ విశ్వనాథ్‌రెడ్డి, ఈవో నాగప్రసాద్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ మార్చి 7వ తేది నుండి 11వ తేది వరకు శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తూ అందులో భాగంగా మొదటి రోజున ఉత్సవమూర్తులకు బండిఆత్మకూరు నుండి గ్రామోత్సవం నిర్వహిస్తున్నామని అన్నారు. 8వ తేదిన బండిఆత్మకూరు నుండి శింగవరం గ్రామాల మీదుగా ఓంకార ఆలయానికి ఉత్సవమూర్తులను గ్రామోత్సవంగా తీసుకెళుతారని తెలిపారు. అలాగే స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి లింగోద్భవ కాలంలో ఓంకార సిద్దేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం నిర్వహించి తెల్లవారుజామున కళ్యాణోత్సవం జరుపుతామన్నారు. 9న స్వామి అమ్మవార్లకు నంది వాహనంపై ఉత్సవం 10న రథోత్సవం, వసంతోత్సవ పూజలు, 11న స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను బండిఆత్మకూరు చేర్చి గ్రామోత్సవం ముగుస్తుంది అన్నారు. భక్తుల ఆహ్లాదం కోసం చెక్కభజన, కూచిపూడి నృత్యప్రదర్శన, వివిధ నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

# కల్లూరులో దోమలు బాబోయ్ దోమలు

### – రోగాలకు గురవుతున్న ప్రజలు
### – పట్టించుకోని మున్సిపల్ అధికారులు


నిల్వ నిలిచిన మురికినీరు

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కల్లూరు అర్బన్ పరిధిలో దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగిపోయింది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దోమలు వ్యాప్తి పెరుగుతున్న మున్సిపల్ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత 25రోజుల నుంచి కల్లూరు పరిధిలో దోమలు వ్యాప్తి అధికంగా పెరిగింది. మురికి కాలువలను శుభ్రం చేయకపోవడం, ఫాగింగ్ చేయకపోవడంతో దోమల వ్యాప్తి పెరిగింది. అయినా మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. మురికినీరు రోడ్లపైనే నిల్వ నిలుస్తుండటంతో దోమలు వ్యాప్తి పెరుగుతుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల వ్యాప్తికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రాజకీయ పార్టీల ఫిర్యాదులను పరిష్కరిస్తాం

### – జాయింట్ కలెక్టర్


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :**రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వివిధ అంశాలపై రాజకీయ పార్టీలు ఇచ్చిన ఫిర్యాదులను ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపామని త్వరలోనే పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం జేసీ చాంబర్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు తదితర అంశాలపై గుర్తింపు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరపున సయ్యద్ రియాజ్ బాషా, తెలుగుదేశం పార్టీ తరపున శివరామ్, ప్రసాద్‌రెడ్డి, బీజేపీ తరపున చంద్రశేఖర్ వైయస్సార్ సీపీ తరపున అనిల్, సాయిరాంరెడ్డి, సీపీఐ పార్టీ తరపున నరసింహులు, బీఎస్పీ తరపున శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఎస్వీర్ ఇంజనీరింగ్ కళాశాల, ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలను ఆమోదం కొరకు ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించామని రాజకీ య పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎన్నికల కమిషన్ నిర్ణయించిన కళాశాలల్లోనే ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వినియోగిస్తామన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి చేర్పులు, మార్పులు సంబంధించి రాజకీయ పార్టీలు ఇచ్చిన ఫిర్యాదులను ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపామని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లాకు 86వేల ఓటరు గుర్తింపు కార్డులు వచ్చాయని, మార్చి 7వ తేదీలోగా ఓటర్లకు పంపిణీ చేస్తామన్నారు. ఈఆర్వోను త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు.

## టీడీపీలోకి రోళ్లపాడు మాజీ సర్పంచు


మాజీ సర్పంచ్ టీడీపీలో చేరిక

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** మిడ్తూరు మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల పార్లమెంటు ఇంచార్జి మాండ్రశివానందరెడ్డి, మండల టీడీపీ నాయకుడు కాకా రమేష్‌రెడ్డి, గుండం రమణారెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ నాగస్వామిరెడ్డి మరియు దాదాపుగా 100 మంది కార్యకర్తలు వెంకటేశ్వరరెడ్డి, ఎన్. వెంకటేశ్వరరెడ్డి, పి.మహిరామరెడ్డి, ఇ. శ్రీనివాసగౌడ్, రాముడు, రామకృష్ణ, మాదిగ రమేష్, హుశేన్ తదితరులు తెలుగుదేశం పార్టిలోకి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంచుతూ అవగాహన కల్పించారు. టీడీపీ మ్యానిఫెస్టోలో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ వైసీపీ ప్రభుత్వంపై మాండ్రశివానందరెడ్డి ధ్వజమెత్తారు. కల్తీ మద్యం తప్ప దోచుకోవడం, దాచుకోవడం తప్ప జగన్ చేసింది ఏమిలేదని ప్రజలలోకి వెళితే బటన్ నొక్కుతున్నామని నిన్న జరిగిన కుప్పం సభలో హంద్రీనీవా ద్వారా కుప్పంకు త్రాగు, సాగునీరు ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం తప్ప అతను ప్రారంభించిన అర్థగంటకే గేట్లు మూసివేయడం హంగామ తప్ప జగన్ పాలనలో ఏమి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వంగాల శివరామిరెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి గిత్తా జయసూర్య, శేశిరెడ్డి సుదాకర్ యాదవ్, వడ్డె అయన్న, సంపంగి రవీంద్రబాబు, మనోహర్‌రెడ్డి, ఎరబం ప్రమోద్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే : బుడ్డా

- తప్పుడు నాయకులను ఎన్నుకుంటే రాష్ట్ర భవిష్యత్తు ప్రశ్నార్థకమే
- రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీనిచ్చే బాబుకే మొదటి ఓటు వేద్దాం
- మాజీ ఎమ్మెల్యే బుడ్డా, యువనేత భూమా విఖ్యాత్‌రెడ్డి



మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజి ఎమ్మెల్యే బుడ్డా

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** రాష్ట్ర భవిషత్‌ను తీర్చిదిద్దే శక్తి యువతకు ఉందని, ఓటు విలువ తెలుసుకొని సరైన నాయకున్ని ఎన్నుకోవాలని, ఒక్కచాన్స్‌తో మోస పోయి బంగారు భవిషత్‌ను ప్రశ్నార్థకంగా మార్చుకున్న యువత చైతన్యవంతులై అమూల్యమైన ఓటును చంద్రబాబుకు వేసి రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందని శ్రీశైలం నియోజకవర్గం మాజి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, యువ నాయకులు భూమా విఖ్యాత రెడ్డిలు అన్నారు. బుధవారం పట్టణంలోని థెరిస్సా కళాశాలలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి, భూమా విఖ్యాత రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు ప్రాముఖ్యతపై వివరిస్తు రాష్ట్ర భవిషత్‌ను మార్చే అత్యంత శక్తివంతమైనది ఓటు ఒక్కటేనని అన్నారు. వైసిపి బూటకపు మాటలు నమ్మి మళ్లి మోసపోవద్దని అన్నారు. రాష్ట్ర భవిషత్ యువత చేతుల్లోనే ఉందని, అత్యంత శక్తి కలిగి యువత సమయస్ఫూర్తితో ఆలోచించి సరైన నాయకున్ని ఎన్నుకోవడంలో ఓటును వినియోగించాలని అన్నారు. చంద్రబాబు పరిపాలన , రాష్ట్రానికి బాబు అవసరత, టిడిపి హాయంలో జరిగిన అభివృద్ధి వివరించారు. వైసిపి పాలనతో రాష్ట్ర అస్తవ్యస్థంగా మారిందని ఉద్యోగాలిస్తానని, ఉపాధి కల్పిస్తానని నమ్మబలికి యువతను నట్టేట ముంచిన వైసిపిని సాగనంపాలని అన్నారు. అరాచక పాలనతో విసుగు చెందిన ప్రజలు టిడిపి పాలనను కోరుకుంటున్నా రని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి యువత భవిషత్‌తో పాటు రాష్ట్ర భవిషత్‌కు బంగారు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వినర్ బన్నూరు రామలింగారెడ్డి, టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు వేణు, శివప్రసాద్ రెడ్డి, టిడిపి నాయకులు పస్పిల్ మున్నా, సతీష్ బాబు, శ్రీకాంత్, అబ్దుల్లాపురం బాష, టిడిపి నాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో యువతి, యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

## ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** శ్రీశైలం ప్రాజెక్టు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని నిర్వహించారు.కళాశాల ఎఫ్ఎస్సి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.బుచ్చయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మానవుని మనుగడకు దేశం పురోభివృద్ధికి, ఆర్థిక అభివృద్ధికి సైన్స్ ఎంతో ముఖ్యమన్నారు.అనంతరం భౌతిక శాస్త్రం అధ్యాపకులు డాక్టర్ యస్. శివనాగిరెడ్డి సివి రామన్ సేవలను కొనియాడారు.కార్యక్రమంలో అధ్యాపకులు పూర్ణేశ్వర రెడ్డి,డాక్టర్ ఎం.పద్మ,కె.నిర్మల,డాక్టర్ కె.రాజన్న, ఎస్.మహేశ్వర రెడ్డి,బి.బాలు, ఎస్.శర్మ,షాహిదా,కళ్యాణి,శష్మ, అధ్యాపకేతర బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## భాగ్యోదయ హైస్కూల్‌లో సైన్స్ దినోత్సవ వేడుకలు

**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** బేతంచెర్ల పట్టణంలోని భాగ్యోదయ హైస్కూల్ ఛైర్మన్ కానాల నాగలక్ష్మి దేవి ఆధ్వర్యంలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పేదవాడి ఫ్రిజ్, ఇంటి పెరడులో నిత్యం వాడుకునే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, మసాలా వస్తువులు సులభంగా ఖర్చు లేకుండా ఎలా పెంచుకోవచ్చు అనే అంశాల మీద ప్రయోగాత్మకంగా వివరించారు. పలు అంశాలపై చార్టుల ద్వారా అవగాహన కల్పించారు. విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని పలువురు అభినందించారు.

## గడ్డివాములు దగ్ధం.. రెండు లక్షలకు పైగా నష్టం..


గడ్డి వాములు దగ్ధమవుతున్న దృశ్యం

**హాలహర్వి, మేజర్‌న్యూస్ :** హాలహర్వి మండలంలోని గూళ్యం గ్రామంలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమయ్యాయి. గురువారం గూళ్యం గ్రామానికి చెందిన గాదిలింగప్ప, రాజశేఖర్, బొజ్జప్ప అనే రైతులకు చెందిన గడ్డి వాములు వేసుకోగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తగలడంతో వాములకు అంటుకొని నిప్పు చెలరేగడంతో చుట్టుపక్కల వారు మంటలను ఆర్పడానికి ప్రయత్నించగా అదుపులోకి రాకపోవడంతో ఫైర్ ఇంజన్ రావడంతో మంటలను అదుపులోకి తెచ్చారు.దాదాపు రెండు లక్షలకు పైగా గ్రాసం నష్టం రావడంతో భాధితులు తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## హౌస్ సర్జన్లకు ఓరియంటేషన్


మాట్లాడుతున్న వెంకటరంగారెడ్డి

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బుధవారం ధన్వంతరి హాల్‌లో 2019 బ్యాచ్ నూతన హౌస్ సర్జన్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఆసుపత్రి వార్డుల్లో విధి నిర్వహణ ఎలా నిర్వహించాలి, ఎలా ఉండాలి అనే దానిపై చర్చించారు. రోగుల పట్ల ఎలా ప్రవర్తించాలి, ఎలా వైద్యం అందించాలి దానిపై అవగాహన కల్పించారు. నూతన హౌస్ సర్జన్లు ఐడీ కార్డు, డ్రెస్ కోర్డు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, హేమనళిని, వెంకటరమణ, శివబాలనగాంజన్ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ


పత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని పగిడిరాయి గ్రామంలోని జగనన్న కాలనీలో ప్రభుత్వ నిధులతో గృహాలు నిర్మించుకున్న 60మంది లబ్ధిదారులకు బుధవారం మాజీ జడ్పీటీసీ జగన్నాథ్‌రెడ్డి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ సీఎం జగన్ ఇళ్లు లేని పేదలకు నవరత్నాలు పథకం కింద గృహాలను మంజూరు చేశారన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా శ్రీదేవమ్మను, ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రంగన్న, ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ సైన్స్ వేడుకలు

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** కర్నూలు రూరల్ పరిధిలోని బి.తాండ్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్‌వో రంగమ్మ హాజరయ్యారు. సైన్స్ మన జీవితంలో ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉందన్నారు. అనంతరం క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీశైలజ, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, మరియానందం, సునిల్, దేవిడ్‌రవిశేఖర్, జయగణపతి, వెంకటరాముడు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

# బొగ్గుల దస్తగిరిని పార్టీ అభ్యర్థిగా గెలిపించండి



**కోడుమూరు మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని పార్టీ అభ్యర్థిగా గెలిపించాలని టిడిపి మాజీ ఇంచార్జి ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మండలాల్లోని కల్లపరి గ్రామ సర్పంచ్ రంగమ్మ బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కృష్ణన్న నాయకత్వం వర్ధిల్లాలి, బొగ్గుల దస్తగిరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం సర్వేల ప్రకారంగా ప్రజాప్రతినిధుల అభిప్రాయం మేరకు ప్రజలకు నచ్చిన బొగ్గుల దస్తగిరికి టికెట్ కేటాయించిందని, దస్తగిరిని నా అభ్యర్థిగా చూడకుండా పార్టీ అభ్యర్థిగా చూడాలని అత్యధిక మెజార్టీతో గెలిపించి తెలుగుదేశం పార్టీ ఖాతాలో వెయ్యాలని ఆయన అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అభివృద్ధి కోరుకోలేదని, తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే ఇప్పటికి నిలిచిపోయిందని తెలిపారు. హంద్రీనీవా నీటిని పందికోన రిజర్వాయర్ ద్వారా గాజులదిన్నెకు తరలించి నియోజకవర్గంలో రైతులకు సాగునీటి కష్టాలను తీర్చానని అయన చెప్పారు. వైయస్ జగన్ రాష్ట్రాన్ని సంక్షేమ పథంలో నడిపించాలని గొప్పలు చెప్పుకుంటున్నాడు తప్ప రాష్ట్రం మొత్తం సంక్షేమంలో కాదు సంక్షేమంలోకి నెట్టాడని ఆయన ధ్వజమెత్తారు. గ్రామాలలో ఎక్కడ అభివృద్ధి లేదని, ప్రజల జీవన విధానానికి వైయస్సార్ పార్టీ నేతలు విఘాతం కలిగిస్తున్నారని వీటిని ప్రజలు క్షమించాలని అన్నారు. స్టేషన్ కి వెళ్లినా, ఎక్కడికి వెళ్లినా వైసిపి గుండాజమే నడుస్తుందని, నియోజకవర్గంలోని ప్రజలు గ్రామాల్లో ప్రశాంత అతను కోరుకుంటున్నారని అన్నారు. రైతుల పాస్ పుస్తకాలపై తన బొమ్మ వేయించుకొని వాటినంతా తాకట్టు పెట్టి కొన్నివేల కోట్ల రూపాయలను తెచ్చుకోవడం జరిగిందని, రైతుల పాస్ పుస్తకాలపై వైయస్ జగన్ బొమ్మ వేసుకోవడానికి రైతులు అభ్యంతరం తెలుపుతున్న పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ బటన్ నొక్కడమే తప్ప చేయలేదని, బటన్ నొక్కి ప్రజల నోట్లకు ప్లాస్టర్ వేశారని ఆయన తీవ్రంగా విరుచుకుపడ్డారు. తమ ప్రియతమ నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో ఆదరించే రకంగా ఉన్నాయని అన్నారు. విద్యావంతుడు సైన్యుడు అయినటువంటి దస్తగిరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అదేవిధంగా నాపై నమ్మకం ఉంచి వచ్చినటువంటి గ్రామాలలో ఫ్యాక్షన్ కు తావు లేకుండా అభివృద్ధికే కృషి చేస్తానని ఆయన తెలిపారు. సర్పంచ్ రంగమ్మ తో పాటు రాముడు ఉరుకుందు మల్లికార్జున కరుణాకర్ హనుమంతు లతోపాటు ఈ కురువ ఈరన్న కురువ రామాంజి పెద్ద రంగడు బువ్వ రామాంజనేయులు జమ్మన్న గోవర్ధన్ కురువెండు ఈరన్న గిడ్డయ్య లతోపాటుగా 200 మంది కాంగ్రెస్ కి గుడ్ బై చెప్పి విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

## టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

### మాజీ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి


టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

**కల్లూరు, మేజర్‌న్యూస్:** టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్మి వైసీపీని వీడి టీడీపీలోకి చేరుతున్నారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. కల్లూరు మండల పరిధిలోని దొడ్డిపాడు గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్య నాయకులు సయ్యద్ హుసేన్, ఉస్మాన్‌బాషలతోపాటు 30కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీలో చేరారు. వారికి గౌరు చరితారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నజీర్‌బాష, జిలాన్‌బాష, నూర్‌బాష, సిలార్ బాష, కాశీం, బందెనవాజ్, మిన్నెల్లా, నబీరసూల్, ఆటో పీక్షా, నబి రసూల్, దస్తగిరి, మసూంవలి పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, టీడీపీ నాయకులు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, పెద్దటేకూరు తరుణ్‌రెడ్డి, మహబూబ్‌బాష, ఖాజాహుసేన్, సయ్యద్‌కాశీం పాల్గొన్నారు.

## దేశంలో ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది


మాట్లాడుతున్న నగరూరు రాఘవేంద్ర

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** యూపీఏ హయాంలో కంటే ఎన్డీయే ప్రభుత్వంలో దేశంలో ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర అన్నారు. బుధవారం నగరంలోని ఇందిరాగాంధీనగర్, వెంకటరమణ కాలనీ, అశోక్‌నగర్‌లలో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరూరు రాఘవేంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ ఫెడరల్ సూత్రాలను గౌరవిస్తూ రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటాగా అదనపు నిధులకు అవకాశాలు ఇస్తుందన్నారు. ప్రతి భారతీయుడు స్వశక్తిపై గౌరవప్రదమైన, ఆరోగ్యదాయకమైన జీవితాన్ని గడిపేందుకు భారత ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం అన్ని సదుపాయాలను సమకూరుస్తుందన్నారు. ఈ కార్యక్కరంలో మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గీతామాధురి, జయశ్రీయాదవ్, అనితజ్యోతి, రాజేశ్వరి, హవిలన్‌బాబు, శ్రీరాములుయాదవ్, రామాంజనేయులు, మధుగౌడ్ పాల్గొన్నారు.

## సమాజానికి ఆర్యవైశ్యులు ఆదర్శంగా ఉండాలి



**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** ఆర్యవైశ్యులు సమాజ సేవలో ఆదర్శంగా వుంటూ పలువురికి ఆదర్శప్రాయంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లు, యువజన విభాగం ఏపీ అధ్యక్షులు శబరి వరప్రసాద్, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు భవనాశి నాగ మహేష్ లు అన్నారు. బుధవారం పట్టణంలోని అమ్మవారిశాల ఆవరణంలో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఆర్యవైశ్య సంఘము గౌరవ అధ్యక్షుడు గుండా గోపాల్, మండల అధ్యక్షుడు కందగడ్డల జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు విద్య వైద్య ఆర్థిక రాజకీయ రంగాలతో పాటు సేవ రంగాలలో రాణించి పలువురికి ఆదర్శంగా ఉండాలని, పేద ఆర్యవైశ్యుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని, ఆర్యవైశ్యులలో అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలని కోరారు. అనంతరం నంద్యాల జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘాల సమాఖ్య ప్రథమ అధ్యక్షులు బొగ్గారపు ధనుంజయ, ప్రధాన కార్యదర్శి భీమిశెట్టి రాజేంద్ర, కార్యనిర్వాహణ అధ్యక్షులు కలికి వెంకట సతీష్, కోశాధికారి బచ్చు లక్ష్మీనారాయణలతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు నాగ సుప్రజ, కార్యనిర్వాహక అధ్యక్షురాలు విజయలక్ష్మి, శ్యాంసుందర్ లాల్, శ్యామ్ సుందర్ గుప్తా, విష్ణు బల్లాని సూర్య, రాజేష్ కిషోర్ ప్రశాంత్ మట్ట రాజేష్, మరియు పట్టణంలోని అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

సూర్య



## శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర గవర్నర్‌కి ఆహ్వానం



రాష్ట్ర గవర్నర్కు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల క్షేత్రంలో మార్చి 1 నుంచి 11 వరకు మహా శివరాత్రి బ్రహ్మో త్సవాలు అత్యంత వైభవంగాజరగనున్నాయి. ఈ ఉత్సవాలకు పలువురు ప్రముఖులను ఆహ్వానించడంజరుగుతోంది. ఈ సందర్భంగా బుధవారం ఆంధ్ర రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ని శ్రీశైల దేవస్థానం చైర్మన్,ఈవో కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు గురుమహాంతు ఉమామహేష్,అర్చక స్వాములు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో గవర్నరు వారికి వేద ఆశీర్వచనంతో శేషవస్త్రాలు,ప్రసాదాలు, శ్రీస్వామిఅమ్మ వార్ల చిత్రపటం, అందజేశారు.

## బీవీ.. ఎన్నికల బరిలో దూసుకెళ్లండి

- మాజీ ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డితో టిడిపి అధినేత చంద్రబాబు
- ప్రజా క్షేత్రంలోకి బలంగా సూపర్ సిక్స్ ను తీసుకెళ్లాలని ఆదేశం
- నిత్యం ప్రజల్లో ఉంటూ కార్యకర్తలకు అండగా నిలిచిన బీవీ వైపే అధినేత మొగ్గు
- టీడీపీ శ్రేణుల హర్షాతిరేకాలు


టిడిపి అధినేత చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** జయనాగేశ్వరరెడ్డి.. సమయం తక్కువగా ఉంది, ఇక ఎన్నికల బరిలో దూసుకెళ్లండి అంటూ.. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డితో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్ర బాబునాయుడు చేసిన వ్యాఖ్యలు ఇవి. బుధవారం ఉండవల్లి నివాసంలో బీవీ జయనాగేశ్వరరెడ్డిచంద్రబాబును కలిశారు. ఎమ్మిగనూరులోనెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, టిడిపి పార్టీ గెలుపు అవకాశాలపై వారు చర్చించారు. టిడిపి మేనిఫెస్టో సూపర్ సిక్స్‌ని ప్రజా క్షేత్రంలోకి బలంగా తీసుకెళ్లాలని చంద్రబాబు బీవీని ఆదేశించారు. టిడిపి పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మాటే తనకు శిరోధార్యమని మాజీ ఎమ్మెల్యే బీవీ స్పష్టం చేశారు. అయితే ఇన్నాళ్లు ఎమ్మిగనూరు అభ్యర్థి విషయంలో చంద్రబాబు ఎటూ తేల్చకపోవడంతో నిన్నటివరకూ టిడిపి శ్రేణుల్లో అయోమయం నెలకొంది. ఇప్పుడు టీడీపీ అభ్యర్థిగా బీవీకి అధినేత నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో వారికి వెయ్యేనుగుల బలం వచ్చినట్లయ్యింది. చంద్రబాబును కలవడంతోనే మాజీ ఎమ్మెల్యే బీవీకి లైన్ క్లియర్ అయ్యినట్టయ్యిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల కాలంలో ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ, నిత్యం ప్రజలకు, క్యాడర్ కు అందుబాటులో ఉంటూ, పార్టీ కోసం మొదటినుంచి పనిచేసిన మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి వైపే టిడిపి అధినేత మొగ్గు చూపినట్లు ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో పార్టీ శ్రేణుల నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

## 4న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన తుగ్గలి మండల పరిషత్ కార్యాలయంలో మార్చి 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ హనుమరాజు ఆదెమ్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. కావునా ఈ సమావేశానికి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలన్నారు. హాజరుకాని అధికారులపై ర్యలు తీసుకునేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు.

# ఎండుతున్న బావులు, బోర్లు

- అడుగంటి పోతున్న భూగర్భజలాలు, రెండువేల బావులు, మూడువేల బోర్లు
- పంటలు సాగుచేసేందుకు నీరు అందని వైనం


గోనెగండ్లలో ఎండిపోయిన బావి

**గోనెగండ్ల,మేజర్ న్యూస్:** ఈఏడాదివేసవి రాకముందే ఎండలు మండి పోతున్నాయి. దీనికి తోడు ఈ ఏడాది వర్షాలు పెద్దగా కురవక పోవడంతోఎండవేడిమికి భూగర్భజలాలు అడుగంట్టి పోతున్నాయి. బావులు,బోర్లు, చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేక ఎండిపోతున్నాయి. పంటలు సాగుచేసుకున్న పోలాల్లోపరిస్థితి ఘోరంగా ఉంది. భూగర్భజలాలు అడుగంటి పోయాయి. దీంత బావులు, బోర్ల దగ్గర పంటలు సాగుచేసుకున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సాగు చేసుకున్న పంటలు చేతికి అందే సమయంలో ఎండిపోవడంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

**బోర కింద సాగు :** గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మండలాల్లో అత్యధికంగా బావులు, బోర్ల కింద రైతులు పంటలు సాగుచేస్తారు. బోర్ల కింద మిరప, ఉల్లి, పత్తి, వేరుశనగ తదితర పంటలు దాదాపు 10వేల ఎకరాల్లో బోర్ల, బావులు కింద సాగు చేసినట్లు తెలుస్తుంది. వేసవికాలం ప్రారంభం కాకముందే ఎండ వేడిమికి భూగర్భజలాలు అడుగంటిపోతే ఇక వేసవిలో పరస్థితి ఏలా ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వర్షాలు సంవృద్ధిగా కురియకపోవడం, ఈ ఏడాది అనుకున్న దాని కంటే ముందే ఎండలు మండుతుండటంతో భూగర్భజలాలు అండుగంటి పోయాయి. **అడుగంటిన భూగర్భజాలాలు :** ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో దాదాపు రెండువేల బావులు,మూడువేల బోర్లు అడుగంటి పోయాయి. ముంద స్తుఎండలురావడం, వర్షాలు సకాలంలో పెద్దవర్షాలు కురవక పోవడం,దీనికి తోడు రైతులు అనాలోచితం గా ఎక్కడపడితే అక్కడ బోర్లు వేయటం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఎమ్మిగనూరు నియోజక వర్గంలోనే బావులు, బోర్ల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ఇక జిల్లాలో పరి స్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎది ఏమైన వర్గాలు సంవృద్ధిగా కురియకపోవడం బావులు, బోర్లు ఎండి రైతుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. గోనెగండ్ల, కులుమాల, ఎర్రబాడు, అలువాల, అగ్రహారం, గంజహళ్లి, బైలువుల, పెద్దమరివీడు, చిన్నమరివీడు, పెద్దనేలటూరు,చిన్ననేలటూరు హెచ్.కైరవాడి పిల్లి గుండ్ల, గ్రామాలతో పాటు పలుగ్రామాల్లో బోర్లు,బావులు అడుగంటి పోతున్నాయి.


బావుల కింద ఎండి పంట

**నాలుగుబోర్లుఎండిపోయాయి :జయరాముడు, పిల్లిగు ండ్ల :** బోరు కిందనాలుగు ఎకరాల్లో పంట వేశాను. వర్షాకాలం బోర్లలో నీరు బాగానే ఉంది. ఏమైందో ఏమో గాని ఎండలు మండిపో యేకొద్ది బోర్లలో నీరు అండుగంటి పోవడం ప్రారంభం అయ్యింది. సాగు చేసిన పంటలు ఎండి పోతున్నాయి.


జయరాముడు, రైతు, పిల్లిగుండ్ల,

**సాగు చేసిన వంటలు ఎండిపోతున్నాయి. కబుల్, రైతు, గోనెగండ్ల :** బోర్ల కింద పంటలు చెవులకాయి. కార్ర, మొక్కజొన్న పంటలు సాగు చేశాము. బోరు, బావుల్లో నీరు అడుగంటి పోయింది. సాగు చేసిన పంటలు చేతికి అం దే సమయంలో నీరు లేకపోవడంతో పం టలు ఎండిపోవడంతో పెట్టిన పెట్టుబడి చేతికందే విధంగా లేదని ఏమి చేయాలో తెలియని దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నామని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.


కబుల్, రైతు, గోనెగండ్ల

## శ్రీశైల మల్లన్న హుండీ ఆదాయం లెక్కింపు

**-రూ. 5,62,30,472 నగదు తో పాటు బంగారం,వెండి విదేశీ కరెన్సీ లభ్యం**

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మ వార్లహుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించినట్లు ఆలయ ఈవో డి.పెద్దిరాజు తెలిపారు. భక్తులు గత 49 రోజులలో సమ ర్పించిన కానుకల్లోరూ.5,62,30,472 నగదు,398 గ్రాముల 800 మిల్లీగ్రాముల బంగారు,7 కేజీల 950 గ్రాముల వెండి,1989-యుఎస్ఏ డాలర్లు,305-కెనడాడాలర్లు,30-ఆస్ట్రేలియా డాలర్లు,25-ఇంగ్లాండు ఫౌండ్స్,56 సింగపూర్ డాలర్లు,10-కువైట్ దినార్స్,30-యుఏఈ దిర్హామ్స్,60-ఈరోస్,10-మలేషియా రింగిట్స్,15 కత్తార్ రియాల్స్ మొదలైన విదేశీ కరెన్సీ ఆదాయంగా చేకూరింది అన్నారు.పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగిందని ఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ రవణమ్మ, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది,శివసేవకులు తదితరులు పాల్గొన్నారు.


హుండీ లెక్కింపు చేస్తున్న దృశ్యం

# శ్వేత పత్రమా..! సర్దుకుపోతారా..!

- నేడే నంద్యాల మున్సిపల్ సమావేశం
- నివేదికలు సిద్ధం చేసిన అధికార యంత్రాంగం
- అధికార వ్యూహం ఏమిటీ..?
- అక్రమాలపై దాడికి సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు



నంద్యాల మున్సిపాలిటీ

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో:** అధికార వైసీపీలో స్వపక్షంలో విపక్షానికి కేంద్ర బిందువుగా మారిన నంద్యాల మున్సిపల్ సమావేశానికి అధికార, ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. గురువారం మున్సిపల్ సమావేశం ఖరారైంది. గత మున్సిపల్ సమావేశంలో అధికార పక్షానికి చెందిన మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ దేశం సులోచన లేవనెత్తిన అంశాలపై అధికార యంత్రాంగం నివేదికలు సిద్దం చేసుకుంది. కౌన్సిల్ సమావేవం వైసీపీ వర్సెస్ వైసీపీగా ఉంటుందా! వైసీపీ వర్సెస్ ప్రతిపక్షాలుగా మారుతుందా! అన్న నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది.

గత మున్సిపల్ సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ దేశం సులోచన ప్రస్తావించిన అంశాలు అటు అధికార పక్షానికి ఇటు అధికార యంత్రాంగానికి ఇరుకున పెట్టాయి. అధికార పార్టీకి చెందిన దేశం సులోచన విపక్షం పాత్ర పోషించారు. దేశం సులోచన మున్సిపల్ సమావేశం తరువాత పది రోజుల్లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి కౌన్సిల్ అనుమతి లేకుండా నంద్యాల మున్సిపాలిటీలో చోటు చేసుకున్న అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసిన విషయం పాఠకులకు విధితమే. కౌన్సిల్ సమావేశం జరిగిన నెల రోజులుకావస్తున్న అత్యవసర సమావేశానికి అధికార పక్షం ముందుకు రాలేదు. తాను తీసుకున్న నిర్ణయానికి దేశం సులోచన కట్టుబడి ఉన్నట్లు తెలుస్తోంది. గత సమావేశంలో చోటు చేసుకున్న పరిణామాలతో మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్నీసా తీవ్ర అసంతృప్తికి లోనైట్లు గుర్తించిన అధికార పార్టీ నంద్యాల అధిష్టానం రంగంలోకి దిగింది. ఎమ్మెల్సీ ఇసాక్ బాషను ఛైర్ పర్సన్‌తో మాట్లాడాలని అధిష్టానం చెప్పినట్లు తెలుస్తోంది. ఒకటి, రెండు సార్లు ఆమెతో ఎమ్మెల్సీ ఇసాక్ బాష మాట్లాడారు. ఆమె తాను ఎదుర్కొన్న, ఎదుర్కొంటున్న పలు అంశాలను ఎమ్మెల్సీ ముందుకు ఉంచినట్లు తెలుస్తోంది. శిల్పా కుటుంబం కల్పించిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆమెకు నచ్చచెప్పిట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం మాబున్నీసా మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డిని కలిసినట్లు తెలుస్తోంది. మున్సిపల్ సమావేశంలో జరుగుతున్న పలు అంశాలు వారి మధ్య చర్చకు జరిగినట్లు తెలుస్తోంది. అధికార పార్టీలోని ఒక నాయకుడు వల్ల పడుతున్న ఇబ్బందులను శిల్పా ముందు ఉంచినట్లు తెలుస్తోంది. నంద్యాల మున్సిపాలిటీలో గత నాలుగు నెలల నుంచి జరిగిన పలు అంశాల గురించి శిల్పా ఆమె ముందు ఉంచినట్లు తెలుస్తోంది. ఈ అంశాన్ని తనకు వదిలిపెట్టాలని, త్వరలోనే అన్ని సర్దుకుంటాయని కార్యాలయానికి యధావిధిగా వెళ్లాలని శిల్పా సూచించిన ట్లు తెలుస్తోంది. మంగళవారం నుంచి ఆమె కార్యాలయా నికి వస్తున్నారు.


ఛైర్ పర్సన్ మాబున్నీసా


మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ దేశం సులోచన

మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి జోక్యం తో ఎమ్మెల్సీ ఇసాక్ బాష దౌత్యంతో నంద్యాల మున్సిపాలి టీలోని ఇద్దరు కీలక ప్రజాప్రతినిధుల మధ్య తలెత్తిన దుమారం నేపథ్యంలో గురువారం జరగనున్న మున్సిపల్ సమావేశం ఆసక్తిని రేకెత్తిస్తుంది. దేశం సులోచన శ్వేత పత్రం డిమాండ్‌కు కట్టుబడి ఉంటారా! సర్దుకుపోతారా! అన్నది రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీ వ్యూహం ఏలా ఉండబోతుంద న్న చర్చ జరుగుతోంది. మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు అధికార యంత్రాంగం నివేదికలను సిద్దం చేసుకుంది. మరి కొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో అధికార పార్టీకి ఇరుకు పెట్టేందుకు ప్రతిపక్షాలు అస్త్ర శస్త్రాలను సిద్దం చేసుకుంటున్నాయి. మున్సిపాలిటీలో చోటు చేసుకు న్న అక్రమాలపై దాడికి సిద్దమవుతున్నారు. నంద్యాల మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన అక్రమాలు, అడ్డగోలు జీతాల పెంపు, సాధారణ నిధుల వినియోగం, ఇబ్బడి ముబ్బడిగా చేపట్టిన అత్యవసర పనులు... బిల్లుల చెల్లింపు అంశాలపై సూర్య దినపత్రిక వరుస కథనాలను అందిస్తున్న క్రమంలో వీటిపై అధికార యంత్రాంగం నుంచి వివరాలు రాబట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తం మీద వైసీపీ వర్సెస్ వైసీపీగా ఉంటుందా..! వైసీపీ వర్సెస్ ప్రతిపక్షాలుగా మారుతుందా..! అన్నది వేచి చూడాలి..